సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



రావయ్యా.. గణపయ్యా

ఆది దంపతుల ప్రియసుతుడు, సర్వ విఘ్నాలు తొలగించే గణనాథుడు భూలోకంలో భక్తుల కోరికలు తీర్చేందుకు విచ్చేస్తున్నాడు. ఆయనకు స్వాగతం పలికేలా మంటపాలను మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈసారి మట్టిగణపతినే పూజించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడేలా తనను మట్టిరూపంలో కొలిచేందుకు సిద్ధమైన భక్తుల కోరికలు తీర్చాలన్న ఆకాంక్షతో వినాయకుడు మరికొద్ది గంటల్లోనే భువిపైకి చేరనున్నాడు. ఈ సాయంత్రం నుంచి నవ రాత్రులపాటు ఘనమైన పూజలందుకోనున్నాడు. తీరొక్క ఫలహారం.. ఉండ్రాళ్ల నైవేద్యం.. భజనలు తదితర ప్రత్యేక కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మికశోభ సంతరించుకోనుంది. వినాయక చవితి విశిష్టత.. పూజావిశేషాలతో ప్రత్యేక కథనం..



- వివరాలు 8లో

న్యూస్‌రీల్

తాతయ్య పోరాటాలపై గర్వపడుతున్నా..

- సాక్షి కథనాన్ని పోస్ట్ చేసిన కేటీఆర్



ఎక్స్‌లో కేటీఆర్ చేసిన పోస్టు

బోయినపల్లి(చొప్పదండి): 'తాతయ్య జోగినిపల్లి కేశవరావు, లక్షల మంది స్వాతంత్య్ర యోధుల పోరాటంపై గర్వపడుతున్నాను. వాళ్లు చేసిన త్యాగాలతోనే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ.' అని మంత్రి కేటీఆర్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'తిరగబడ్డ పోరుగడ్డ' శీర్షికతో 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనాన్ని మంత్రి కేటీఆర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మా తాతయ్యతోపాటు లక్షలాది మంది సమరయోధుల పాత్ర కూడా ఉంది, ఇలాంటి పోరాటాల్లో మా తాతయ్య ఉండడం మాకు గర్వకారణం... అని పేర్కొన్నారు.

షుగర్ వ్యాధిని ముందే గుర్తిస్తే మేలు

- అర్బన్ బ్యాంకు చైర్మన్ నారాయణ



సిరిసిల్ల: షుగర్(మధుమేహం) వ్యాధిని ముందే గుర్తించి వైద్యం చేయించుకుంటే మేలు జరుగుతుందని సిరిసిల్ల అర్బన్ బ్యాంకు చైర్మన్ గాజుల నారాయణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం లయన్స్ ప్రతినిధులు ఉచిత షుగర్ వ్యాధి పరీక్షల శిబిరం నిర్వహించారు. గాజుల నారాయణ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా షుగర్ వ్యాధి వస్తుందని, ముందు చూపుతో పరీక్షలు చేసుకుని మందులు వాడితే ఎలాంటి ఇబ్బంది పండదన్నారు. పోత్గల్ ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్, రజక సంఘం పట్టణాధ్యక్షుడు దండు శ్రీనివాస్, వాకర్స్ ప్రతినిధులు వాసం శ్రీనివాస్, జిందం రమేశ్, ఏనుగుల ప్రభాకర్, దర్శనాల కిష్టస్వామి, ఇట్టబోయిన వెంకటేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నగునూరి శ్రీకాంత్, కార్యదర్శి బచ్చు భానుచందర్, డాక్టర్ దోర్నాల శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిలో దిక్సూచి

- నాడు దైన్యం.. నేడు ధైర్యం
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్
- హడావుడి లేకుండానే ముగిసిన జాతీయ సమైక్యత వేడుకలు


మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్


జెండా వందనం చేస్తున్న వినోద్‌కుమార్, చైర్‌పర్సన్‌లు అరుణ, కళ, బీఆర్‌ఎస్ నాయకులు


పోలీసుల గౌరవ వందనం

సిరిసిల్ల: అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాల అమలులో తొమ్మిదేళ్లలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని, జిల్లాను దేశానికి దిక్సూచిగా నిలిపామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ సమైక్యత, సమగ్ర వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యుత్తు, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధి కల్పన, అభివృద్ధి, ప్రజాసంక్షేమం, ఐటీ వరకు అన్ని రంగాల్లో దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. ప్రభుత్వ వైద్యరంగం నాడు దీన స్థితిలో ఉండేదని.. నేడు పేదలకు ధైర్యమిస్తుందని పేర్కొన్నారు. ఆనాడు ఐదు మెడికల్ కాలేజీలుంటే.. నేడు 26 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. 33 జిల్లాల్లో 33 మెడికల్ కాలేజీలు లక్ష్యంగా, 33 నర్సింగ్ కాలేజీలతో ముందుకుసాగుతున్నట్లు స్పష్టం చేశారు.

జిల్లాలో ప్రగతిబాటలు

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగుజలాలు, భూగర్భ జలాల లభ్యత పెరగడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2016లో 1,77,960 ఎకరాలున్న సాగు విస్తీర్ణం నేడు 2,40,430 ఎకరాలకు పెరిగిందని తెలిపారు. కాళేశ్వరం ప్యాకేజీ-9 మల్కపేట రిజర్వాయర్ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో.. దీని ద్వారా జిల్లాలోని 96,150 ఎకరాలకు సాగునీరు అందనుందని వివరించారు. రైతుబంధులో 1.27 లక్షల మందికి ఇప్పటి వరకు రూ.1269 కోట్ల సాయం అందించామని, రూ.33 కోట్లతో 14 గోదాములను నిర్మించామని, రైతు భీమాతో 1923 రైతుకుటుంబాలకు రూ.96.15కోట్ల బీమా పరిహారంగా చెల్లించినట్లు వివరించారు. జిల్లాలోని పేదలకు 3,443 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,20,202 మందికి ఆసరా పింఛన్లు ప్రతి నెల రూ.26.51 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 'కళ్యాణలక్ష్మి'లో 22,095 మందికి రూ.201.96 కోట్లు, షాదీ ముబారక్‌లో 1,017 మందికి రూ.9.01 కోట్ల సాయం అందించామన్నారు. దళితబంధులో 206 మందికి సాయం అందించినట్లు తెలిపారు. జిల్లాలోని బీసీ, ఎంబీసీలకు మొదటి విడతలో 600 మందికి రూ.లక్ష చొప్పున అందించినట్లు తెలిపారు.

విద్యతో భవితకు పునాది

ఐటీఐ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల, వ్యవసాయ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ వైద్యకళాశాల, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ శిక్షణ–పరిశోధన కేంద్రంతో జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నారు. నేతన్నలకు అండగా ఉండేందుకు రూ.2,500 కోట్లతో బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ వస్త్రాల ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చామన్నారు. పెద్దూరు వద్ద 60 ఎకరాల్లో రూ.174 కోట్లతో అపెరల్ పార్క్, 88 ఎకరాల్లో రూ.388 కోట్లతో వీవింగ్ పార్కులు ఏర్పాటైనట్లు చెప్పారు. రూ.4.50 కోట్లతో గోకుల్‌దాస్ ఇమేజెస్ పరిశ్రమ ఏర్పాటుతో 950 మంది మహిళలకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని 8 వేల మంది మహిళలకు గార్మెంట్ రంగంలో ఉపాధి లభించనున్నట్లు వివరించారు. రైతుల మాదిరిగానే నేతన్నలకు బీమా ఇస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ మార్గదర్శకంలో జిల్లా అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో ఉందన్నారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, బి.గౌతమ్‌రెడ్డి, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, ఆర్డీవోలు ఎన్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సీపీవో శ్రీనివాసాచారి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, డీపీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగం మధ్యలో కరెంట్ కట్

కలెక్టరేట్‌లో వినోద్‌కుమార్ ప్రసంగిస్తుండగా మధ్యలో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఐదు నిమిషాల పాటు అధికారులు హైరానా పడ్డారు. జనరేటర్ ఆన్ చేయడంలో వినోద్‌కుమార్ ప్రసంగాన్ని కొనసాగించారు. అంతకు ముందు ఆయన పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి కేటీఆర్ రావాల్సిన ఈ వేడుకలకు ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ పాల్గొనడంతో చాలా మంది బీఆర్‌ఎస్ నాయకులు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. హడావుడి లేకుండానే వేడుకలు ముగిశాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ లేకుండానే.. ఎలాంటి తోపులాట.. నెట్టివేతలు లేకుండా వేడుకలు జరిగాయి. కలెక్టరేట్‌లో మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని వినోద్‌కుమార్ కోరారు.


వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

విత్తన గణపతులు పంపిణీ


విత్తన గణపతి ప్రతిమలు అందిస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, జెడ్పీటీసీ ఉమ ఆధ్వర్యంలో ఆదివారం విత్తన గణపతులు పంపిణీ చేశారు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్‌లకు విత్తన గణపతి ప్రతిమలు అందించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, కవ్వంపల్లి రాములు పాల్గొన్నారు.

రైతాంగ పోరాటాన్ని నడిపింది కమ్యూనిస్టులే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరయ్య


మాట్లాడుతున్న వీరయ్య

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించింది కమ్యూనిస్టులే అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్.వీరయ్య పేర్కొన్నారు. స్థానిక బీవైనగర్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు బహిరంగసభలో మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో వెట్టిచాకిరీ, భూస్వాముల పెత్తందార్లకు వ్యతిరేకంగా కమ్యూనిలే ఎర్రజెండా పట్టుకొని పేదల తరఫున పోరాడామన్నారు. కానీ హిందూ, ముస్లిం పోరాటం జరిగినట్టుగా చిత్రీకరించి ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ పడుతున్నట్లుగా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కైలాస్ బాబు, శాంతి ప్రకాశ్ శుక్లా, జిల్లా కమిటీ సభ్యులు మూశం రమేశ్, కోడం రమణ, ఎగమంటి ఎల్లయ్య, ఎర్రవెల్లి నాగరాజు, జవ్వాజి విమల, వీర్నపల్లి ఎంపీటీసీ మల్లారం అరుణ్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.


సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో వేడుకలు


జిల్లా కాంగ్రెస్ ఆఫీస్‌లో..


బీజేపీ ఆధ్వర్యంలో..

వెల్లివిరిసిన జాతీయతాభావం

సిరిసిల్లటౌన్: నిజాం నిరంకుశత్వం నుంచి ప్రజాస్వామ్యంలోకి మారిన రోజును పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో ఆదివారం జాతీయతా భావం వెల్లివిరిసింది. జాతీయ పండుగలా పట్టణంలో తిరంగా జెండాలు ఎగిరాయి. ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాల ముందు త్రివర్ణ పతకాలు రెపరెపలాడాయి. స్థానిక చేనేతన్నచౌక్‌లో సామాజిక సమరసత వేదిక, గాంధీనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణాధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, అంజన్న, కైలాశ్, ఊరగొండ రాజు, శ్రీగాధ మైసయ్య, గుద్ల విష్ణు పాల్గొన్నారు. డీసీసీ ఆఫీసులో పీసీసీ కార్యదర్శి నాగుల సత్యనారాయణగౌడ్, గాంధీచౌక్‌లో పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ జెండాలు ఆవిష్కరించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, నాయకులు ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, అశోక్ పాల్గొన్నారు. సీపీఐ ఆఫీస్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అమరుల త్యాగాలతోనే తెలంగాణ విమోచనం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ


జాతీయ జెండాకు గౌరవవందం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

వేములవాడ: త్యాగధనుల పోరాటాలతోనే తెలంగాణకు విమోచనం లభించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆంధ్రా బ్యాంకు చౌరస్తాలో ఆదివారం జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ భారత స్వాతంత్య్రం సిద్ధించినప్పటికీ తెలంగాణ ప్రాంతంలో నిజాం నిరంకుశ పాలనపై పోరాటం సాగిందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ అమరవీరుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ మాత్రం గత ముప్పై ఏళ్లుగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు, నాయకులు ముప్పిడి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, పిన్నింటి హన్మండ్లు, రామతీర్థం హరీశ్, బిళ్ల కృష్ణ, నామాల శేఖర్, చందనం సత్తయ్య, వెంకన్న, మల్లేశంయాదవ్ పాల్గొన్నారు.

నవరాత్రికి రాజన్న ముస్తాబు

- ముస్తాబైన వేములవాడ క్షేత్రం
- నేడు నిత్య కల్యాణాలు రద్దు



వేములవాడ: ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు వినాయకచవితి సందర్భంగా నాగిరెడ్డి మంటపంలో గణేశ్ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈమేరకు నాగిరెడ్డి మండపంలో ఏర్పాట్లు చేశారు. 18న ఉదయం 9.15 గంటలకు పుణ్యాహవచనం, అఖండ దీపారాదన, సిద్ధి బుద్ధి వినాయక ప్రతిష్ఠ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వినాయక చవితి రోజున సాయంత్రం 4 గంటలకు శమంతకోపాఖ్యానం నిర్వహిస్తారు. ఈనెల 26న రాత్రి 7.10 గంటల నుంచి పెద్దసేవ ఊరేగింపు అనంతరం గణేశ్ నిమజ్జనం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. వినాయక చవితి రోజు నిత్య కళ్యాణం రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

క్లుప్తంగా

'సింగిరెడ్డి' విగ్రహం ఏర్పాటు చేయాలి



భూపతిరెడ్డి స్తూపానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ సింగిరెడ్డి భూపతి రెడ్డి స్తూపానికి ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ప్రభుత్వం సింగిరెడ్డి భూపతి రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ తంగళ్లపల్లి మండల కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, శ్రీరాముల రమేశ్‌చంద్ర, గోరంతల రాజమల్లు, అవధూత హరిదాసు, బొద్దుల నరేందర్, సామల మహేందర్, కంసాని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట వాసులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలుగు వెలుగు జాతీయ స్వచ్ఛందసంస్థ ఎల్లారెడ్డిపేటకు చెందిన ఇద్దరిని విశిష్ట కళారత్న అవార్డులతో సత్కరించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన ముత్యాల ప్రభాకర్‌రెడ్డి ఫొటోగ్రఫీలో ప్రతిభ చూపుతున్నందుకు విశిష్ట కళారత్న జాతీయ పురస్కారం అందజేసింది. ప్రకృతి ప్రేమికుడు దుంపెన రమేశ్ మొక్కల పంపిణీతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు లెజెండ్ జాతీయ పురస్కారాన్ని అందించింది.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నగదు ఇస్తున్న ఆటోనగర్ యూత్ ప్రతినిధులు

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన పడిగె సతీశ్ అనే మెకానిక్ ఇటీవల క్రికెట్ ఆడేందుకు వెళ్లి, పిడుగుపాటుతో మృతిచెందిన విషయం విదితమే. అతని కుటుంబసభ్యులకు ఆదివారం ఆటోనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల శ్రీనివాస్, ప్రతినిధులు రూ.51 వేల ఆర్థిక సాయం అందించారు. తోటి మెకానిక్ కుటుంబాన్ని ఆదుకోవడం తమ బాధ్యతగా భావించి, సాయం చేసినట్లు తెలిపారు.

మహాకాయ.. పార్వతి తనయ



నేటి నుంచి వినాయక నవరాత్రోత్సవాలు

కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్ : మహాకాయుడు.. పార్వతి తనయుడు.. సర్వ విఘ్న వినాశకుడు వినాయకుడి చవితి వేడుకలకు ప్రజలు సమాయత్తమయ్యారు. వేదకాలం నాటికే గణపతి పూజనీయుడైన దేవుడు. గజాననుడు, గణపతి, ఏకదంతుడు, లంబోధరుడు.. ఇలా ఎన్నో పేర్లతో భక్తులతో పూజలందుకుంటాడు. అబాల గోపాలానికి ఆరాధ్య దైవ్యం. ఏ కార్యం ప్రారంభించినా.. ఏ పూజ నిర్వహించినా మొదట పూజించేది వినాయకుడినే. భాద్రపద శుద్ధ చవితి స్వామి వారి పుట్టినరోజు కావడంతో వినాయకచవితి పర్వదినం లోక ప్రసిద్ధి చెందింది. చిన్న కండ్లు సూక్ష్మ బుద్ధికి, తొండం స్వీయ గౌరవానికి, పెద్ద చెవులు సకల విశేషాలను ఆకళింపు చేసుకోవడానికి, పెద్ద బొజ్జ రహస్యాలను దాచి ఉంచుకోవడానికి ప్రతీకలు. సోమవారం వినాయకచవితి సందర్భంగా కథనం..

గణపతులు 32 రూపాలు

- తంత్రశాస్త్రంలో గణపతులు 32 రూపాలుగా వర్ణించబడ్డాయి. భక్తి గణపతి, లక్ష్మీగణపతి, సిద్ధి గణపతి, భువనేశ గణపతి, హేరంబ గణపతి, మహాగణపతి, విఘ్నరాజ గణపతి, ఊర్ధ్వ గణపతి, ఉచ్ఛిష్ట గణపతి, శక్తి గణపతి, ధ్వజ గణపతి అనే 16 రూపాలు ఎక్కువ ప్రచారంలో ఉండగా, శ్రీవిజయ గణపతి, ఏకాక్షర గణపతి, వర గణపతి, త్ర్యక్షర గణపతి, హరిద్ర గణపతి, ఏకదంత గణపతి, సృష్టి గణపతి, ఉద్దండ గణపతి, రుడ్నీ గణపతి, దుండిగణపతి, ద్విముఖ గణపతి, త్రిముఖ గణపతి, సింహ గణపతి, యోగ గణపతి, శ్రీసంకటహర గణపతి అన్నవి అంతగా ప్రచారంలో లేవు.

వ్రత విధానం

- చవితినాడు ఉదయం స్నానానంతరం నిత్యకర్మలు పూర్తి చేసుకుని శక్తిని బట్టి బంగారం, వెండి, మట్టితో చేసిన వినాయకుడి ప్రతిమను ఇంట్లో ఉత్తరం దిశలో బియ్యం పోసి మండపాన్ని నిర్మించాలి. అష్టదళ పద్మాన్ని రూపొందించి వినాయకున్ని ప్రతిష్ఠించాలి. శ్వేత గంధ అక్షతలు, పుష్పాలు ఏకవింశతి పత్రాలతో అర్చించాలి. ధూప, దీపాలు, వెలగ, నేరేడు తదితర ఫలాలను రకానికి 21 చొప్పున నివేదించాలి. త్రిలోక ప్రసిద్ధమైన ఈ వ్రతాచరణతో గణపతి అనుగ్రహం కలిగి సర్వ కార్యాలూ నెరవేరుతాయి. ఈ వ్రతాచరణ ఫలితంగానే విదర్భ రాజ యువరాణి దమయంతి నల మహారాజును, శ్రీకృష్ణుడు శమంతక మణి, జాంబవతి, సత్యభామకు ఇష్ట సఖుడయ్యాడు.



విదేశాల్లో సైతం గణపతి ఆరాధన

గణపతి ఆరాధన కేవలం మన దేశానికే పరిమితం కాదు. శ్రీలంక, టిబెట్, నేపాల్, థాయ్‌లాండ్, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్, మధ్యఆసియా, జావా, బలిద్వీపం, బోర్నియా, మంగోలియా, కంబోడియా, బర్మా, చైనా, జపాన్, అమెరికా వంటి దేశాల్లో కూడా వినాయకుడిని వారి వారి సంప్రదాయాల్లో రూపొందించి ఆరాధిస్తారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం



రాజయ్య (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని మర్తనపేట గ్రామానికి చెందిన కొత్త కొండ రాజయ్య(48) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం బైక్‌పై వెళ్లి, నాంపెల్లిలోని లక్ష్మీనరసింహ స్వామివారి దర్శించుకున్నాడు. తిరిగి వస్తుండగా సిరిసిల్ల రెండో బైపాస్‌లోని చంద్రంపేట వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలవగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కూమారుడు, కూతురు ఉన్నారు. కూతురికి 15 రోజుల క్రితమే వివాహం జరిగింది. ఇంటి పెద్దను కోల్పోవడంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

కల్వర్టుపై ప్రమాదకరంగా బుంగ



వంతెన మధ్యలో ఏర్పడిన బుంగ

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డులో స్థానిక పెట్రోల్ బంక్ పరిసరాల్లోని లో లెవెల్ వంతెన మధ్యలో పెద్ద బుంగ ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు ఒక వైపు పూర్తిగా శిథిలమై పైపులు తేలిన విషయం తెలిసిందే. అయితే ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆ కల్వర్టు మీదుగానే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రాత్రిళ్లు ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు అంటున్నారు. బుంగ వద్ద ఎలాంటి హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు భయంభయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఆ ప్రదేశాన్ని ఆదివారం బీజేపీ నాయకుడు కొనుకటి హరీశ్, బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్, నాయకుడు పెగ్గెర్ల మహేందర్, సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ పరిశీలించారు.

వైషమ్యాలు సృష్టించడం మానుకోవాలి

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల: ఇండియాకు పర్యాయపదం భారత్ అని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. రాజ్యాంగంలోని మొదటి పేజీలోనే ఇండియా అంటే భారత్ అని ఉందని తెలిపారు. రాజ్యాంగానికి అవసరమైన మార్పులు చేయాలని సీఎం కేసీఆర్ సూచించారని, మంచి కోసం ఏదైనా చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రాచరిక పాలన నుంచి విముక్తి పొంది, ప్రజాస్వామ్య పాలన ఆవిర్భవించిన 1948 సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యత, సమగ్ర దినోత్సవంగా జరుపుకోవాలని సీఎం కేసీఆర్ బాగా ఆలోచించే నిర్ణయించారని తెలిపారు. దేశంలో కొందరు వైషమ్యాలను సృష్టించడం, రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలన్నారు. భిన్నమతాలు, సంస్కృతుల మధ్య దేశంలో ఒకే ఎన్నిక, ఒకే దేశం.. ఒకే భాష, అధ్యక్ష తరహా పాలన సరికాదన్నారు. రాజ్యాంగంలోనే ఈ విషయం స్పష్టంగా ఉందని తెలిపారు.



నియామక పత్రాలు ఇస్తున్న వినోద్‌కుమార్

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

రుద్రంగి(వేములవాడ): గుండెపోటుతో హఠాన్మరణం చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కొమురయ్యగౌడ్ కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడొద్దని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపెల్లి వినోద్‌కుమార్ అన్నారు. బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించారు.

జలకళతో సిరిసిల్ల సస్యశ్యామలం

ముస్తాబాద్(సిరిసిల్ల): నెర్రెలతో కరువు ప్రాంతంగా ఉన్న సిరిసిల్లను నేడు జలకళతో సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సాధు వెంకట్‌రెడ్డి ఐటీఐ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రైవేటు కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శంకరయ్య, రైతు బంధు సమితి అధ్యక్షుడు నర్సయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళ, రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, రుద్రంగి, కథలాపూర్ జెడ్పీటీసీలు గట్ల మీనయ్య, నాగం భూమయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కృషి

- వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు
- విశ్వకర్మ జయంతి వేడుకలకు హాజరు

వేములవాడ: చేతివృత్తులను ఆదరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అన్ని వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ పట్టణ విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కష్టనష్టాలు వచ్చినా కుల వృత్తినే జీవనాధారంగా చేసుకొని, పనిముట్లనే నమ్ముకొని జీవిస్తున్న విశ్వకర్మ సోదరులందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాల హయాంలో విశ్వకర్మలు నిర్లక్ష్యానికి గురయ్యారని అన్నారు. ఈ ఏడాది విశ్వకర్మ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలాస నరేందర్, కౌన్సిలర్లు, విశ్వకర్మ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



వేడుకల్లో లక్ష్మీనర్సింహారావు, చైర్‌పర్సన్ మాధవి, విశ్వబ్రాహ్మణ నాయకులు

మట్టి గణపతులను పూజిద్దాం





విగ్రహాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్లు మాధవి, కళ, నాయకులు

సిరిసిల్లటౌన్/వేములవాడ: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి కోరారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హిందూ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో 5,016 వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. వైస్‌చైర్మన్ శ్రీనివాస్, వేములవాడ కమిషనర్ అన్వేశ్, మేనేజర్ సంపత్‌రెడ్డి, సురేశ్, కౌన్సిలర్ పద్మ, శ్రీధర్ తదితరులున్నారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): మట్టి వినాయకుల ప్రతిమలనే పూజించాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సమకూర్చిన మట్టి వినాయకుల విగ్రహాలను ఆదివారం గంభీరావుపేటలో పంపిణీ చేశారు. రవీందర్‌రావు మాట్లాడుతూ రసాయనలతో కూడిన విగ్రహాలను వినియోగించడంతో చెరువుల్లో నీరు కలుషితమవుతుందన్నారు. ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణశాఖ అధ్యక్షులు వెంకటస్వామిగౌడ్, వెంకటి యాదవ్, నాయకులు కూర సురేశ్, బాలకిషన్‌రావు, నాగరాజుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆకునూరి రాజేందర్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

వేములవాడ లాడ్జీలో వివాహిత హత్య

- పరారైన హంతకుడు
- సీసీ ఫుటేజీల్లో లభించిన దృశ్యాలు
- పోలీసుల గాలింపు



వెంకటవ్వ (ఫైల్)



పోలీసులు విడుదల చేసిన అనుమానితుడి ఫొటో

వేములవాడ: వేములవాడలోని జాతర గ్రౌండ్‌లోని ఓ ప్రైవేట్ లాడ్జీలో ఆదివారం వివాహిత సద్గుల వెంకటవ్వ(46) హత్యకు గురైంది. వివరాలు వేములవాడటౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన వెంకటవ్వ వివాహం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటకు చెందిన రాములుతో 20 ఏళ్ల క్రితం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. రెండు రోజుల క్రితం వెంకటవ్వ ఇంటి నుంచి వెళ్లినట్లు భర్త రాములు పోలీసులకు తెలిపారు. భర్త రాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివాహేతర సంబంధమే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది.

అద్దె గదిలో వివస్త్రగా..

వేములవాడలోని ఓ ప్రైవేట్ లాడ్జీలో శనివారం రాత్రి వెంకటవ్వ పేరుతో గదిని అద్దెకు తీసుకున్నారు. గదిలో వెంకటవ్వతోపాటు మరో వ్యక్తి ఉన్నట్లు లాడ్జీ యజమాని తెలిపారు. అదే రోజు రాత్రి అర్ధరాత్రి సదరు వ్యక్తి లాడ్జీ నుంచి వెళ్లిపోయినట్లు సీసీ కెమెరా ఫుటేజీల్లో రికార్డ్ అయ్యింది. అయితే ఆధార్‌కార్డు ఇవ్వాలని లాడ్జీ యజమాని కోరడంతో తీసుకొస్తానని చెప్పి వెళ్లిన సదరు వ్యక్తి తిరిగిరాలేదు. అనుమానం వచ్చిన లాడ్జీ యజమాని ఆదివారం సాయంత్రం ఆ గదిని పరిశీలించగా.. బెడ్‌పై వెంకటవ్వ శవమై కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వేములవాడటౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై రమేశ్ అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు.



సంఘటన స్థలంలో విచారణ చేపడుతున్న పోలీసులు

అనుమానితుడి ఫొటో విడుదల

వేములవాడ ప్రైవేట్ లాడ్జీలో వెంకటవ్వ హత్య కేసులో అనుమానితుడిగా పేర్కొంటున్న వ్యక్తి ఫొటోను పోలీసులు ఆదివారం విడుదల చేశారు. ఆచూకీ తెలిసినవారు వేములవాడ ఠాణా 87126 56413 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

రజకుల హక్కుల సాధనకు కృషి

ముస్తాబాద్(సిరిసిల్ల): రజకుల హక్కుల సాధనకు కృషి చేస్తున్నట్లు రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ తెలిపారు. పోతుగల్ ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన ఆయనను ఆదివారం ముస్తాబాద్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రజకుల కోసం 250 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నారని, బీసీ బంధులో రజకులకు అవకాశం కల్పించారని అన్నారు. భవిష్యత్తులో రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గతంలోనే సీఎం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రజకులు వెన్నంటి నిలిస్తే తప్పకుండా కార్పొరేషన్ ఏర్పాటవుతుందని తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు నారాయణ, నాయకులు శేరయ్య, సత్తయ్య, దేవయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రజకులు

రాజన్నకు వీకెండ్ తాకిడి

వేములవాడ: రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగిపోయింది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకాలు, అన్నపూజల సమయం, టికెట్లను కుదించారు. భక్తుల ద్వారా రూ.20 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

